www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 23 మే 2023

శరవేగంగా తిరుపతి స్టేషన్ అప్‌గ్రేడేషన్ పనులు

ప్రజాశక్తి-తిరుపతిటౌన్: తిరుపతి రైల్వేస్టేషన్ అప్‌గ్రేడేషన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. బేస్‌మెంట్ ఫ్లోరింగ్ పని దక్షిణం వైపున పూర్తయింది. రెండు ఎయిర్‌కోర్సుల కోసం ఫౌండేషన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. అండర్ గ్రౌండ్ వాటర్ ట్యాంక్ కోసం పునాదులు ,గోడల నిర్మాణం పూర్తయింది. అయితే టాప్ స్లాబ్ యొక్క షట్టరింగ్ పురోగతిలో ఉంది. మే 2022లో ప్రారంభించిన తిరుపతి రైల్వే స్టేషన్ అప్‌గ్రేడేషన్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి . రైల్వే మంత్రిత్వ శాఖ రూపొందించిన "రైల్వే స్టేషన్ల ప్రధాన అప్‌గ్రేడేషన్"లో భాగంగా ప్రాధాన్యతా ప్రాతిపదికన దక్షిణ మధ్య రైల్వే జోన్ ఈ ప్రాజెక్టును చేపట్టింది. ఫిబ్రవరి 2025 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న ఈ ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేసేలా పనులు చేపడుతున్నారు.

వామ్మో కీర్తి..ఎంత పని చేసింది..!

- 'శానంబట్ల'ను వణికించిన 'మంటలు'
- పోలీసుల జోక్యంతో కథ కంచికి...

ఘటన పూర్వాపరాలను వివరిస్తున్న తిరుపతి జిల్లా అదనపు ఎస్పీ వెంకటరావు, డీఎస్పీ టీడీ యశ్వంత్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

శానంబట్ల అగ్నికీలలు రాష్ట్రాన్ని అట్టుడికించాయి.. పది రోజుల పాటు పోలీసులకూ అంతుచిక్కలేదు.. క్షుద్రపూజలనుకున్నారు.. గంగమ్మ పూనిందనుకున్నారు.. మాంత్రికుడు చేతబడి చేశారని, అక్కగార్లు ఊరునుంచి అలిగిపోయారన్న మూఢనమ్మకాలన్నీ పెద్దఎత్తున చర్చ నడిచాయి.. సోషల్‌మీడియా, ఎలక్ట్రానిక్ మీడియాలో మూఢనమ్మకాలను బలపరిచేలా పుంకాలు పుంకాలుగా కథలు అల్లాయి. కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, ఎంఎల్ఎ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి స్వయంగా వెళ్లి పరిశీలించి మరీ 'భయపడొద్దు' అని చెప్పారు తప్పితే విషయం తేల్చలేకపోయారు.

పోలీసులైతే ఎవరైనా దుండగులు, ఆకతాయిలు చేస్తున్నారా? అన్న కోణంలో పరిశీలించి సిసి కెమెరాలను ఏర్పాటు చేసి, పోలీసు గస్తీ ఏర్పాటు చేశారు. అయినా మంటలు ఆగలేదు. రోజుకొకచోట చెలరేగేవి.. గడ్డివాములు దగ్ధం కావడం, బీరువాల్లో బట్టలు కాలిపోవడం, పరుపులు మాడిపోవడం, వాషింగ్ మిషన్ ఇలా వరుస ఘటనలు జరిగాయి. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పది రోజుల పాటు గ్రామస్తులు బతికారు. తమ ఊరికి ఏదో అయ్యిందని, కొంతమంది ఊరు ఖాళీ చేయాలని అనుకున్నారు. అయితే దీని అంతు తేల్చాలని పోలీసులు గట్టిగా నిఘా ఉంచారు. డిఎస్‌పి టిడి యశ్వంత్, చంద్రగిరి సిఐ ఓబులేశులు క్షుణ్ణంగా గ్రామాన్ని పరిశీలించారు. ఎవరి ఇల్లయితే తొలి మంట రేగిందో వరుసగా వారిని ఖాళీ చేయించి ప్రత్యామ్నాయం చూపించారు. అందులో తొమ్మిది మందిని అనుమానాస్పదంగా ఉండడంతో అలిపిరి స్టేషన్‌లో విచారించారు. విచారణ జరుగుతుందని తెలిస్తే గ్రామస్తులు అడ్డుకుంటారని 'సేఫ్టీ' కోసం తీసుకెళుతున్నామని చెప్పారు. ఏమైతేనేం పది రోజుల తరువాత మంటల నిప్పు పెట్టిన నిందితురాలు కీర్తిని అరెస్టు చేయడంతో శానంబట్ల మిస్టరీ కథ కంచికి చేరింది.

అసలు ఏం జరిగింది..?

ఇంటర్ ఫెయిలైన విద్యార్థి కీర్తి(19)కి తల్లిపై అనుమానం. ఊళ్లో ఎలాగోలా పుకార్లు రేకెత్తించి ఊరొదిలి పోవాలన్నది కీర్తి ప్లాన్. ఈ నేపథ్యంలోనే 20 రోజుల క్రితం కొంతమంది కుర్రోళ్లు ఊళ్లో గడ్డివామికి నిప్పు పెట్టారు. ఇంటర్ ఫెయిలై ఇంట్లో ఉన్న కీర్తి మంటలు వరుసగా పెట్టి గ్రామస్తులను భయపెడితే ఊరు విడిచి పోవచ్చని ప్లాన్ చేసింది. పిల్లపాళెం శివశంకర్‌రెడ్డి ఇంట్లో గడ్డివామికి నిప్పుపెట్టింది. ఈశ్వర్‌రెడ్డి ఇంటికి నిప్పు పెట్టింది. ఆనందరెడ్డి ఇంట్లో మంచం కాల్చింది. ఇంట్లో బీరువాలో పెట్టిన 35వేలు కాజేసి బట్టలకు నిప్పు పెట్టింది. అమ్మ చీరకూ తానే నిప్పు పెట్టి ఆర్పేసింది. వరుస మంటల నేపథ్యంలో గ్రామంలో ఏదో 'శక్తి' పూనిందని పుకార్లు పుట్టాయి.

ఎలా ఛేదించారు..?

పది రోజుల వరకూ పోలీసులకు ఏమీ అర్థం కాలేదు. తొలుత ఈశ్వర్‌రెడ్డిని, ఆనందరెడ్డిని, శివశంకర్‌రెడ్డిని 'భద్రత' పేరుతో ఖాళీ చేయించారు. అయినా మంటలు ఆరలేదు. కీర్తి తండ్రి ప్రసాద్‌రెడ్డిఇల్లు ఖాళీ చేయించారు. నాలుగు రోజులుగా మంటలు లేవు. కీర్తి వాళ్ల ఇల్లు ఖాళీ చేయించిన తరువాత మంటలు ఆగిపోయాయి. సిసి కెమెరాల్లో పరిశీలించిన పోలీసులు ఏం జరిగింది? అని విచారించారు. 36,500 రూపాయలు బీరువాలో ఉన్నాయని, అవి కాలిపోయాయని దర్యాప్తులో కీర్తి అమ్మచెప్పింది. అయితే ఫోరెన్సిక్ విచారణలో డబ్బులు కాలినట్లు లేదు. దీంతో అనుమానం వచ్చి తమదైన శైలిలో విచారించారు.

చివరకు కీర్తికి ఒప్పుకోక తప్పలేదు. తన తల్లిపై అనుమానంతో తానే చేశానని, ఈ ఊరు వదిలి వెళ్లిపోవాలన్న కోరికతోనే ఇదంతా చేశానని అంగీకరించింది. 12 అగ్గి ఘటనలకూ 29 అగ్గిపుల్లలు వాడినట్లు చెప్పింది. 2500 రూపాయలు తాను ఖర్చు చేసినట్లు చెప్పి, మిగిలిన సొత్తు పోలీసులకు అప్పగించింది. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు శానంబట్లలో పర్యటించే ప్రయత్నం చేసినా పోలీసులు అనుమతి ఇవ్వలేదు. ఇది రసాయనాల వల్ల ప్రమాదం తప్ప, భూతాలు, మంత్రాలు కాదని తేల్చి చెప్పారు. సెక్షన్ 453, 506 ఐపిసి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విషాదంతోనే.. 'ఉపాధి' పనులు

పాతూరులో ఒక్కొక్కరిదీ ఒక్కో కన్నీటి గాథ

ప్రజాశక్తి-తిరుపతి సిటి

అరవై ఏళ్లు వచ్చాయంటే ఉద్యోగులు రిటైర్ అయ్యి వచ్చిన రిటైర్మెంట్ బెనిఫిట్స్, పింఛన్‌తో పిల్లల చెంత సేద తీరుతారు.. వీరిని 'విశ్రాంతి' ఉద్యోగులు అని కూడా అంటాం.. అయితే కూలీల బతుకులు చచ్చేవరకూ కష్టాలతోనే.. తిరుపతి నగరానికి 15 కిలోమీటర్ల దూరంలోని పాతూరులో ఊరంతా ఉపాధి పనులకే వెళుతుండటం గమనార్హం. తిరుపతికి వెళ్లాలంటే పెద్దఎత్తున ఛార్జీలు పెట్టాల్సి రావడం, ఒకవేళ వెళ్లినా పని దొరుకుతుందో లేదోనని అభద్రతాభావంతో గ్రామస్తులు 'ఉపాధి' పనులకే వెళుతుండటం గమనార్హం. అరవై ఏళ్లు దాటిన ముసలీ ముతక సైతం ఈ ఉపాధి పనులు చేస్తుండటం 'ప్రజాశక్తి' క్షేత్రస్థాయి పరిశీలనలో వెలుగులోకి వచ్చింది. ఒక్కొక్కరిదీ ఒక్కో కథ. వింటే ఎవరికైనా కడుపు తరుక్కుపోవాల్సిందే.

కొడుక్కి గుండెజబ్బు ఉండటంతో : మారెమ్మ, పాతూరు

నా వయస్సు 60 ఏళ్లు. ఐదేళ్ల క్రితం భర్త చనిపోయాడు. ముగ్గురు కుమార్తెలకు పెళ్లిళ్లు చేసింది. అయితే కొడుక్కి గుండెజబ్బు.. ప్రస్తుతం 30 ఏళ్లు. హైస్కూల్ చదువుతున్న సమయంలోనే స్కూలు తరపున ఉచిత వైద్యశిబిరం పెట్టగా గుండెజబ్బు ఉందని గుర్తించారు. ఒంటిపై ఉన్న నగలు అమ్మి కొడుకును దగ్గరలోని చెన్నయ్‌కి తీసుకెళ్లింది. ఆపరేషన్ చేస్తే గానీ ఏమీ చెప్పలేమన్నారు. చేతిలో చిల్లిగవ్వ లేదు. చుట్టుపక్కలవారి సలహా మేరకు అప్పుచేసి మరీ వేలూరు సిఎంసికి తీసుకెళ్లింది. వైద్యులు పరీక్షలు నిర్వహించి చేయి దాటిపోయింది, ఏమీ చేయలేమన్నారు. తనను ఎక్కడికీ తీసుకెళ్లొద్దని, ఈ వయస్సులో అవస్థలు పడొద్దని చెప్పాడు. గుండెలనిండా విషాదం నింపుకుని ఉపాధి పనులకు వెళుతోంది. ఉపాధి పనులు లేని సమయంలో నాటు నాటడం, కోత కోయడం, కలుపు తీయడం పనులకు వెళుతూ కొడుకును చూసుకుంటోంది.

కడుపున పుట్టినోళ్లే కాదన్నారు : బక్కమ్మ (75)

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన కొత్తల్లో పుట్టింది. చిన్నతనంలోనే పెళ్లయ్యింది. 20 ఏళ్లకే ఇద్దరు బిడ్డలకు తల్లయ్యింది. సొంతూరులో ఉన్న అరెకరా పొలాన్ని నమ్ముకుని జీవనం సాగించారు. భూమి నీళ్లు లేక బీడుగా మారడంతో కూలిపనులను నమ్ముకున్నారు. కాస్తోకూస్తో ఉన్న స్థలాలను అమ్మి పిల్లల పెళ్లిళ్లకు దారబోశారు. పదడుగుల స్థలంలో పాక వేసుకుని జీవనం సాగిస్తున్నారు. పాతికేళ్ల క్రితం భర్త మరణించాడు. కొడుకు కోడళ్ల ఎత్తిపొడుపు మాటలతో వ్యక్తిత్వాన్ని చంపుకోలేక కూలి పనులకు వెళుతోంది. సొంతకుంపటి పెట్టుకుని వృద్ధాప్యంలోనూ ఆయాసపడుతూనే ఉపాధి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. బతికినన్ని రోజులూ కష్టంతోనే బతకాలని నిర్ణయించుకుంది.

పిల్లల్లేరు..ఏకాకిని.. : పార్వతమ్మ (50)

చిన్నతనంలోనే పెళ్లయ్యింది. కొన్నాళ్ల క్రితం భర్త పోయాడు. తోడబుట్టిన వారు దూరమయ్యారు. అయినవారి ఆదరణ కరువయ్యింది. ఆత్మాభిమానమే ఆమెను ఇంకా బతికిస్తోంది. భార్యాభర్తలిద్దరూ కూలి చేసుకుని జీవనం సాగించేవారు. సంపాదించిన దాంట్లో కొంత చుట్టుపక్కల పిల్లలకు ఏదో ఒకటి కొనిచ్చేవారు. చుట్టుపక్కల పిల్లల్ని చూసుకుంటూ పిల్లలు లేరనే బాధను మరచిపోయేవారు. అయినవారు గొడ్రాలని నిందించారు. తోడబుట్టిన వారు ఎక్కడ సాయం చేయాల్సి వస్తుందోనని దూరం బెట్టారు. భర్తను కోల్పోయింది. ఏకాకి జీవితం. చుట్టుపక్కలవారి ఆదరణతో ఉపాధి పనులు చేసుకుంటూ, అందరి తలలో నాలుకలా బతికేస్తోంది.

ఇలా ఉపాధి కూలీల్లో ఒక్కొక్కరిది ఒక్కో గాధ. 60ఏళ్ల వయస్సున్న పాతూరు బుజ్జమ్మ వారి పిల్లలను పెంచి పెద్దచేసి, పెళ్లిళ్లు చేసాక, తమను గెంటేయడంతో వృద్ధాప సమస్యతో బాధపడతున్న భర్తను సాకేందుకు ఉపాధి పనులు చేస్తోంది. చదువు కోసం పట్టణాల బాటపట్టి.. ఉన్నత చదువులు చదివి హోటళ్లో..లాడ్జీల్లో పని చేసుకుంటున్న విద్యావంతుల బాధలను చూసిన మరికొంత మంది యువ జంటలు చదువెందుకు, తమను కాపాడేది కాయకష్టమే నని నమ్మి, భార్యాభర్తలు ఇరువురు పాతికేళ్ల వయస్సులోనే ఉపాధికి వెళ్లుతున్న వైనం. ఇలా ఎన్నో జీవిత సత్యాలు అక్కడ 'ప్రజాశక్తి' తారసపడ్డాయి. అది చేశాం..ఇది చేశాం అని గొప్పలు చెప్పుకోవడమే తప్ప క్షేత్రస్థాయిలో దయనీయ పరిస్థితులు పేదలను వెంటాడుతూనే ఉన్నాయి.

బిజెపి ఎంపీ బ్రిజ్ భూషన్‌ను అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన రెజ్లర్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, బిజెపి పార్లమెంటు సభ్యులు బ్రిజ్ భూషన్ శరణ్‌సింగ్‌ను తక్షణం అరెస్టు చేయాలని సిఐటియు ,ఐద్వా ,ఎస్ఎఫ్ఐ ,డివైఎఫ్ఐ ,రైతు సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి డాక్టర్ పి సాయి లక్ష్మి, డి వై.ఎఫ్.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ జయచంద్ర, ఎస్.ఎఫ్.ఐ జిల్లా కార్యదర్శి మాధవ్ కష్ణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి హేమలత, సి.ఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు ఆర్ లక్ష్మీ మాట్లాడుతూ లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా గత 27 రోజులుగా ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న మహిళా రెజ్లర్లను తక్షణమే పిలిచి మాట్లాడి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 39 కేసుల్లో నిందితుడిగా ఉన్న బిజెపి ఎంపీ, రెజ్లర్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు బ్రిజ్ భూషన్ శరణ్ సింగ్‌ను తక్షణం అన్ని అధికార రాజకీయ పదవుల నుండి తొలగించి, సుప్రీంకోర్టు న్యాయమూర్తితో సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న రెజ్లర్ల శిబిరం వద్ద విద్యుత్తు పంపిణీ, మంచినీటి సరఫరాను పునరుద్ధరించాలని, ఆందోళనకారుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఢిల్లీ పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ప్రజాసంఘాలుగా పెద్ద ఎత్తున ఉద్యమించుతామని హెచ్చరించారు. మెడల్స్ సాధించినప్పుడు ఇంటికి పిలిచి మరీ ఆతిథ్యం ఇచ్చిన ప్రధానమంత్రి నేడు రెజ్లర్ల సమస్య పట్ల మౌనం వహించడంపట్ల తప్పు పట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.నరేంద్ర, కె.సుమన్, సురేష్, చరణ్, వేణుగోపాల్, మునిరాజు, బుజ్జి, మురళి, రవి, అక్బర్, భాస్కర్, శివ, సునీల్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి : వ్యకాసం

ప్రజాశక్తి - గూడూరు రూరల్

గ్రామీణ ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. తిరుపతి జిల్లా గూడూరు ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం వ్యకాసం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పనిగట్టుకుని ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేయాలని, నిధులు తగ్గించి, పని గంటలు పెంచి రెండు పూటలా పనిచేసేలా చేస్తోందన్నారు. వేసవిలో పనిచేసేటపుడు మజ్జిగ, టెంట్లు, తాగేందుకు నీళ్లు, పరికరాలు ఇవ్వాల్సి ఉండగా డబ్బులు పూర్తిగా ఇవ్వకుండా రద్దు చేయాలనే ఆలోచనలో ఉందన్నారు. బడ్జెట్‌లో సైతం నిధులను భారీగా కోత పెడుతోందన్నారు. వామపక్షాల మద్దతుతో ఏర్పాటు చేసిన ఉపాధి హామీ పథకాన్ని బిజెపి ప్రభుత్వం రద్దు చేయాలని చూస్తోందన్నారు. ముఖ్యంగా అంబానీ, అదానీలకు దోచి పెడుతోందన్నారు. పేదలకు పట్టెడన్నం పెడుతున్న ఉపాధి హామీని కొనసాగించి, కనీస కూలి ఇవ్వాలని, వేసవిలో సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పోరాడి సాధించుకున్న ఈ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలన్నారు. అనంతరం స్పందన కార్యక్రమంలో గూడూరు ఆర్డీవో ఎం.కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జోగి శివకుమార్, బివి రమణయ్య, ఎస్.ముత్యాలయ్య, జి.రాజగోపాల్, ఎ.ప్రసాద్, పుట్టా శంకరయ్య, బి.రమేష్ పాల్గొన్నారు.

రూ.100 కోట్ల విలువైన...

దేవాదాయశాఖ భూమి స్వాధీనం

ఆక్రమణ కట్టదాలను సీజ్ చేసిన అధికారులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

గత కొన్ని నెలలుగా తిరుపతి నగర పరిధిలోని యాదవ వీధిలో గల శ్రీ నాదముని ఆల్వార్ స్వామి దేవస్థానానికి చెందిన 100 కోట్ల విలువైన భూమిని నిబంధనలకు విరుద్ధంగా ఆక్రమించుకున్నారు. అనుభవించిన వారి చెర నుంచి సోమవారం పోలీసులు, రెవెన్యూ, దేవాదాయ శాఖ సిబ్బంది ఆక్రమణకు గురైన 90 సెంట్లు భూమిని జిల్లా దేవాదాయ శాఖ అధికారి రామకష్ణారెడ్డి ఆదేశాలతో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కస్తూరి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా దేవాదాయ శాఖ అధికారి రామకష్ణారెడ్డి మాట్లాడుతూ యాదవ వీధిలో అత్యంత పురాతనమైన శ్రీ నాదముని ఆల్వార్ స్వామి దేవస్థానానికి చెందిన సర్వేనెంబర్(పాతది)422, తిరుపతి అర్బన్ లెక్కదాఖలా టీఎస్ నెంబర్ 3187, 3454లో గల సుమారు 100 కోట్లు రూపాయల విలువ చేసే 90 సెంట్లు భూమిని కే.శ్రీనివాసులు ఇతరులు ఆక్రమించుకున్నారన్నారు. దేవస్థానానికి సంబంధించిన సదరు భూమిపై 2011లో కోర్టును ఆశ్రయించడం జరిగిందన్నారు. ఈ మేరకు కోర్టు వారు 2023 మార్చి 20న సదరు స్థలం దేవస్థానానికి చెందినదని ధ్రువీకరిస్తూ తీర్పునిచ్చిందన్నారు. కోర్టు తీర్పును అనుసరిస్తూ ముందస్తుగా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చామన్నారు. అక్రమదారులు దేవాదాయశాఖ నోటీసులపై కోర్టుకు వెళ్లినా కోర్టు స్పందించలేదన్నారు. ఈ మేరకు రెవెన్యూ, పోలీసు, దేవాదాయశాఖకు చెందిన అధికారుల సమీక్షంలో సదరు స్థలాన్ని పరిశీలించి స్వాధీనం చేసుకున్నామన్నారు. 2011 నుంచి సదరు స్థలానికి సంబంధించి ఆక్రమణదారులు చెల్లించాల్సిన బకాయిలు 86 లక్షల 90 వేల రూపాయలు ఇంతవరకు చెల్లించలేదని, ఈ బకాయిల వసూళ్లపై పిటిషన్ వేయనున్నట్లు డీఈఓ తెలిపారు. దేవాలయశాఖ స్వాధీనం చేసుకున్న ఈ శ్రీ నాదముని ఆల్వార్ దేవస్థాన స్థలములో ఎవరైనా నిబంధనలను అధిక్రమించి ప్రవేశించినా, దేవస్థానం స్థలం కు నష్టం కలిగించే చర్యలు చేపట్టిన అట్టి వారిపై సివిల్ క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ స్వాధీన కార్యక్రమంలో గ్రూప్ ఆలయాల ఈవో రామచంద్రారెడ్డి, సర్వేయర్ రమేష్, రెవెన్యూ ఎస్పై బి. సుమనప్రియ, వివిధ ఆలయాల ఈవోలు ఎం.మునికష్ణయ్య, వి. మునికష్ణమూర్తి, జి.జయకుమార్, ఈ.మునిశేఖర్, వీఆర్వోలు ఎన్.మునికుమారి, మారుతీ రావు, పోలీసులు, ప్లాన్ ప్రొటెక్షన్ సిబ్బంది, స్పెషల్ పార్టీ దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

స్థలాన్ని స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

జబ్బార్‌లేవుట్ రోడ్డు విస్తరణకు మేయర్ పరిశీలన

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

తిలక్ రోడ్డు నుండి జబ్బర్ లే అవుట్ వరకు రోడ్డు వెడల్పు కు ప్రతిపాదన పెడతామని మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత, ఉప మేయర్లు భూమన అభినయ్, ముద్ర నారాయణ అన్నారు. తిరుపతి నగర పాలక పరిధిలోని తిలక్ రోడ్డు నుండి జబ్బర్ లే అవుట్, యం.జి.కట్టా, శ్రీ దేవీ కాంప్లెక్స్ వరకు సోమవారం ఉదయం మేయర్, కమిషనర్, ఉప మేయర్లు, అధికారులు పరిశీలించారు. ఈసందర్భంగా మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ తిలక్ రోడ్డు నుండి జబ్బర్ లే అవుట్ వరకు రోడ్డు ను వెడల్పు చేసి దానికి తిరుమల తిరుపతి దేవస్థానం వారి తో మాట్లాడి ప్రతిపాదన పెడతామని ఈ సందర్భంగా తెలిపారు. తిలక్ రోడ్డు నుండి జబ్బర్ లే అవుట్ కు ఆటోలు, అంబులెన్స్ పోవాలంటే ఇబ్బందిగా ఉండేదని స్థానికులు తెలిపారని, అందులో భాగంగా రోడ్లను పరిశీలించడం జరిగిందని తెలియజేశారు. కమిషనర్ హరిత మాట్లాడుతూ తిలక్ రోడ్డు నుండి జబ్బర్ లే అవుట్ కు, మల్లయ్య గుంటకట్టా, పెద్ద కాపు వీధి కి రాకపోకలకు ఇబ్బందిగా ఉందని, అంబులెన్స్ కి రావాలన్న ఇబ్బంది పడుతున్నామని అక్కడున్న స్థానికులు ఫిర్యాదుల పైన రోడ్డును పరిశీలించడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప మేయర్ ముద్ర నారాయణ, యస్.ఈ. మెహన్, యం.ఈ. చంద్ర శేఖర్, డి.ఈ. దేవిక, వైఎస్ఆర్సిపి నాయకులు ఉదయ్ వంశీ తదితరులు ఉన్నారు.

రోడ్డు విస్తరణ ప్రతిపాదనను పరిశీలన

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఇసుక డిసిల్టేషన్‌పై మాట్లాడుతున్న కలెక్టర్

స్పందన' కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి, నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కారం చూపాలని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ శ్రీనివాసరావుతో కలిసి గ్రీవెన్స్ అర్జీలను స్వీకరించారు. వీరితో పాటు ఎస్‌డిసి కోదండ రామిరెడ్డి ఉన్నారు. మొత్తం 142 అర్జీలు సోమవారం అందాయి.

నిర్ణయించిన మేరకే ఇసుక తవ్వకాలు జరగాలి

స్వర్ణముఖి నదిలో నిర్ధారణ మేరకు ఇసుక డిసిల్టేషన్ జరపాలని జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణా రెడ్డి సూచించారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం చైర్మన్, జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణా రెడ్డి అధ్యక్షతన జరిగింది. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణముఖి నది ఎగువభాగన కూచివాడ గ్రామం , నాయుడు పేట మండలం ఇసుక వున్న ప్రదేశం విస్తీర్ణం 29.6 హెక్టార్లు. 2,96,000 క్యూబిక్ మీటర్లకు 1 మీటర్ లోతు మాత్రమే తీయాలని కమిటీ సమావేశంలో నిర్ణయం మేరకు అనుమతి మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీ సమావేశంలో మైన్స్ ఏడీ ప్రకాష్ కుమార్ , గూడూరు డివిజన్ మైన్స్ అధికారి రవికుమార్, ఆర్ డబ్ల్యూ ఎస్ ఈఈ విజయకుమార్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాల్సిందే : కలెక్టర్

సమస్యల పరిష్కారానికి వచ్చిన అర్జీలను పూర్తిస్థాయిలో పరిష్కారం అయ్యేంత వరకూ కృషి చేయాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత అన్నారు. డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమం సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యలయంలో జరిగింది. స్పందనలో కమిషనర్ కి అర్జీ ఇచ్చిన స్టాండింగ్ కమిటి సభ్యులు, కార్పొరేటర్ ఎస్.కె.బాబు మాట్లాడుతూ తిరుపతి నగరంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డి అడిక్షన్ సెంటర్లో చికిత్సలు తీసుకున్న వారికి అవసరమైన మందులు కొరతగా వున్నాయని, అదేవిధంగా వెంకటేశ్వర థీయోటర్ రైల్వే గేటుపై పుట్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరగా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని కమిషనర్ హరిత తెలిపారు. గోపాల్ రాజు కాలనీలో కుక్కల బెడద ఉందని, ఉపాధ్యాయ నగర్లో పందుల బెడదనే పిర్యాధులపై కమిషనర్ స్పందిస్తూ తగు చర్యలు చేపడుతామన్నారు. రైతుబజార్లో వ్యాపారం చేసుకుంటున్న తమకు వ్యాపారం సరిగా జరగడం లేదని, రైతుబజార్ బయట తోపుడు బండ్లు, బుట్టల్లో అనాధికారికంగ అమ్ముకోవడం వలన తమకు నష్టం వస్తున్నదనే ఫిర్యాదుపై స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు. అదేవిధంగా కొన్ని ఏరియాల నుండి భూగర్భ డ్రైనేజి సమస్యలు తెలుపగా వెంటనే తమ సిబ్బందిని పంపి పరిష్కరిస్తామని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత ఐఏఎస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ సునీత, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, ట్రైని డిప్యూటీ కలెక్టర్ శ్రీలేఖ, ఎంఈలు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికష్ణ పాల్గొన్నారు.

ఆస్పత్రిలో చెత్తను తొలగించాలని నిరసన

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో కంపు కొడుతున్న చెత్తను తొలగించాలని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ నగరి నియోజకవర్గ కార్యదర్శి ఆర్ వెంకటేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని తీసుకొచ్చి అన్ని ప్రాంతాల్లో పరిశుభ్రత పాటించాలని సూచిస్తుంటే పుత్తూరు పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో కంపు కొడుతున్న చెత్తతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. రోగులు వాసనకు తట్టుకోలేక ముక్కులు మూసుకొని వైద్యం చేసుకుంటున్నారని ఆవేదన చెందారు. మున్సిపల్ అధికారులు పుత్తూరులోని అన్ని వార్డుల్లో పర్యటించడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని.. లేనిపక్షంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు శివ, రమేష్, హరిచంద్ర నాయుడు, కష్ణమూర్తి, రవి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడి మృతికి నివాళులు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: సిరుగురాజుపాలెం పంచాయతీకి చెందిన వైసీపీ నాయకుడు జయరాంరెడ్డి అలియాస్ బుజ్జిరెడ్డి మతి చెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర మంత్రి ఆర్కే రోజా సోదరుడు కుమారస్వామిరెడ్డి గ్రామానికి చేరుకుని మతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి పరామర్శించారు. ఆయనతోపాటు సర్పంచ్ మురళీమోహన్ యాదవ్, తడుకు సింగిల్ విండో ప్రెసిడెంట్ శ్రీనివాసులురెడ్డి, మాజీ సర్పంచ్ గంగాధరం, వైసీపీ కుటుంబ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రతాప్‌రాజు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: తెలుగుదేశం పార్టీ నాయకులు, పుత్తూరు మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్, ప్రముఖ శల్య వైద్యులు డాక్టర్ ఎస్.ప్రతాప్ రాజు జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు మాట్లాడుతూ నిండు నూరేళ్ళ శల్యవైద్యులుగా, టీపీపీ పార్టీకి సేవలందిస్తూ ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్, 27 వార్డు కౌన్సిలర్ బసంతి, ఐటీడీపీ కోఆర్డినేటర్ ఈశ్వర్ యాదవ్, ముస్లిం మైనార్టీ అధ్యక్షులు మహమ్మద్ రఫీ, 19వ వార్డు అధ్యక్షులు ఉమాశంకర్‌రెడ్డి, సాయి, శేఖర్, మురళీరాజు, శేఖర్‌రాజు, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థుల భవిత

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థుల భవిత అని.. అన్ని వసతులతోపాటు మెరుగైన ఆ ంగ్ల విద్యను అందిస్తున్నారని పాఠశాల కమిటీ ఛైర్మన్ మురళీ సూచించారు. సోమవారం గేట్ పుత్తూరు ఆంధ్రకేసరి ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల ఛైర్మన్, సీఆర్పీలు కలిసి మొదటి తరగతిలో చేరే పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో సీఆర్పీ జగ్గారావు, ఉపాధ్యాయులు శేఖర్ , మంజుల, సునీత, గోవిందమ్మ పాల్గొన్నారు.

యువగళం పాదయాత్రలో భానుప్రకాష్

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: యువగళం పాదయాత్ర 100 రోజులు దిగ్విజయంగా పూర్తి చేసుకుని నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో జరుగుతున్న యువగళం పాదయాత్ర లో నగరి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి గాలి భాను ప్రకాష్ సోమవారం కలుసుకున్నారు. ప్రజల కోసం చేస్తున్న పాదయాత్ర ప్రజాబలంతో సంపూర్ణంగా విజయవంతం అవుతుందని ఆకాంక్షించారు. భుజం నొప్పితో బాధపడుతున్న నారా లోకేష్ ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. వైసీపీ పాలనలో సర్వనాశనం అయిన రాష్ట్రాన్ని కాపాడుకోవడం, యువత భవిష్యత్తు కోసం చేస్తున్న పాదయాత్ర సాహసోపేతమైన నిర్ణయమని, అన్ని వర్గాలకు భరోసా ఇస్తోందని తెలిపారు.

ఉపాధి పనుల తనిఖీ

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: మండలంలోని సిరుగురాజుపాలెం పంచాయతీలో జరుగుతున్న ఖండిత కంధకాల పనులను సోమవారం జిల్లా పథక సంచాలకులు శ్రీనివాస ప్రసాద్ తనిఖీ చేశారు. కూలీలతో మాట్లాడి రోజుకు రూ.272 వేతనం అందేలా పనులు చేపట్టాలని.. ఎండలు కావడంతో ఉదయం ముందుగానే పనుల్లో దిగాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు ఉద్యాన పంటల సాగుకు ఎకరాకు రూ.లక్ష రాయితీ ఇస్తారని..మండలంలో 100 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేయించాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ సరిత, ఏపీవో భార్గవి, సిబ్బంది పాల్గొన్నారు.

మానవ మనుగడకు

జీవవైవిధ్య పరిరక్షణ అవసరం

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-క్యాంపస్: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి "మానవాళి మనుగడకు జీవవైవిధ్య పరిరక్షణ అవసరం' అని పిలుపు నిచ్చారని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవవైవిధ్య మండలి ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టడం జరుగుతున్నదని రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం ఉదయం స్థానిక ఎస్వీ వెటర్నరీ ఆడిటోరియంలో అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం-2023 రాష్ట్ర స్థాయి కార్యక్రమం నిర్వహించగా ముఖ్యఅతిధిగా రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనుల శాఖ మంత్రి పాల్గొన్నారు. రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనులశాఖ మంత్రి మాట్లాడుతూ జీవవైవిధ్య చట్టం-2002, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం 2006 లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవవైవిధ్య మండలి ఏర్పాటు చేసి రాష్ట్ర, జిల్లా మండలి, పంచాయతీ స్థాయిలలో ప్రజా జీవవైవిధ్య రిజిస్టర్‌లను సిద్ధం చేసి జీవవైవిధ్యానికి సంబంధించిన వివిధ అంశాలపై వీడియోలను, ప్రచురణలు, పోస్టర్లు, నాలెడ్జ్ మెటీరియల్స్, పుస్తకాలు మొదలైన వాటితో జీవవైవిధ్యంపై జీవవైవిధ్య యాజమాన్య కమిటీలతో గ్రామస్థాయి వరకు వ్యాప్తి చేసి అనుసరిస్తున్నామని తెలిపారు. మనం తినే ఆహారంలో 97 శాతం మొక్కల నుండి 3 శాతం జంతువుల నుండి ఉంటుందన్నారు. మనం మొక్కలు, జంతువులు మన మనుగడ అన్నారు. రాష్ట్రంలో ఇంటింటికి ఔషధ మొక్కల పంపిణీ 13 వేల స్వయం సహాయక సంఘాలతో 5,82,000, 11 నర్సరీలను అభివృద్ధి చేసి 6,60,000 ఔషధ మొక్కలను పెంచడం జరిగిందని, జీవవైవిధ్య పార్కులు, జీవవైవిధ్య మ్యూజియంలు, జీవ వైవిధ్య వారసత్వ ప్రదేశాలు అభివద్ధిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవ వైవిధ్య మండలి మూడు ప్రధాన లక్ష్యాలతో ముందుకు పోతున్నామన్నారు. రాష్ట్రంలో ఉన్న జీవవైవిధ్యాన్ని సంరక్షించుటకు చర్యలు తీసుకోవాలని.. జీవవైవిధ్యాన్ని సుస్థిరమైన విధానాల్లో వినియోగించుటకు చర్యలు తీసుకోవాలని, జీవవనరులు వాణిజ్యపరంగా వినియోగం జరిగినప్పుడు, తద్వారా లభించు ప్రయోజనాన్ని హక్కుదారులకు సమానంగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఇన్ని చేస్తున్నా కొంత మేరకే సాధించామని, కార్యాచరణ ప్రణాళికను మేరకు 2030 ఒప్పందంలో ఉన్న అన్ని చర్యలను మనం తప్పనిసరిగా అమలు చేయాలి అనే ఆలోచనను, 2050 నాటికి సురక్షితమైన, సుస్థిరమైన జీవవైవిధ్యాన్ని సాధించేందుకు సమిష్టి కషి చేయాలన్నారు. సమావేశం ప్రారంభానికి ముందు మంత్రి అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం -2023 రాష్ట్ర స్థాయి కార్యక్రమం ఏర్పాటులో ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు చేశారు. బయోడైవర్సిటీ బోర్డ్(విజయవాడ), యోగి వేమన విశ్వవిద్యాలయం, మత్స్య శాఖ, నేషనల్ గ్రీన్ కార్పొరేషన్, ఫారెస్ట్ జూలాజికల్ పార్క్ సంయుక్తంగా స్టాల్ ఏర్పాటు, జియో లాజికల్ సర్వే ఆఫ్ ఇండియా , బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా, వ్యవసాయ శాఖ, పరంపర వైద్య మహా సంఘం పుత్తూరు వారి ఆయుర్వేద నిలయం, డీఆర్డీఏ వారి చిరుధాన్యాల ప్రాధాన్యత, విద్యా విద్వాన్ బద్వేల్ ఆయుర్వేదం, పశుసంవర్ధక శాఖ స్టాల్స్ సందర్శించి ఫారెస్ట్ శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన జీవవైవిధ్యాన్ని తిరిగి నిర్మిద్దాం అని మిషన్ లైఫ్ సెల్ఫీ తీసుకున్నారు.

కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ సభ్యులు రెడ్డెప్ప , బోర్డ్ ఛైర్మన్ బి.ఎం.కె.రెడ్డి, అడిషనల్ పి.సి.సి.ఎఫ్. కె. గోపీనాధ, టిటిడి బోర్డు మెంబర్ పోకల అశోక్ కుమార్, ప్రొఫెసర్ సర్జన్‌రావు, రిజిస్ట్రార్ రవి, జూక్యురేటర్ సెల్వం, సి.ఎఫ్.ఓ. నాగేశ్వరావు, ఎ.సి.ఎఫ్.నాగభూషణం, బయోట్రిం డి.ఎఫ్.ఓ. యశోదాబాయి , డి.ఎఫ్.ఓ. సతీష్ , చిత్తూరు, తిరుపతి , అన్నమయ్య జిల్లాల జీవ వైవిధ్య మండలి అన్ని స్థాయిల సభ్యులు, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మేనకూరుకు ఉత్తమ అవార్డు

ఉత్తమ అవార్డు అందుకుంటున్న పుత్తూరుకు చెందిన చంద్రశేఖర్‌రాజు

నాయుడుపేట: మానవాళి మనుగడకు అవసరమైన జీవవైవిధ్యాన్ని పెంపొందించడంలో విశేష కృషి చేసిన నాయుడుపేట మండలం మేనకూరు పంచాయతీ ఉత్తమ అవార్డును కైవసం చేసుకుంది. సోమవారం తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ ఆడిటోరియంలో జరిగిన అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డును ఆంధ్రప్రదేశ్ జీవ వివైద్యం బోర్డు ఛైర్మన్ బీఎంకేరెడ్డి వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కట్టా సుధాకర్‌రెడ్డికి అందించి అభినందించారు. నాయుడుపేట మాజీ వైస్ ఎంపీపీ కస్తూరయ్య తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో ప్రతి ఇంటిపై బీఎస్పీ జెండా

ప్రజాశక్తి-కోట: రాబోయే ఎన్నికల సమయానికి ప్రతి పల్లెలో ప్రతి ఇంటిపై బీఎస్పీ పార్టీ జెండా నిలబెట్టాలన్నదే తన లక్ష్యమని గూడూరు డివిజన్ స్థాయి పట్టణ బీఎస్పీ నాయకులు డాక్టర్ ఉయ్యాల రామకష్ణారావు అన్నారు. సోమవారం విద్యానగర్‌లోని డాక్టర్ ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. మన ప్రాంతంలో ఇప్పటివరకు ఓ బీసీ ఎమ్మెల్యే లేరని, దీని కోసంగా రానున్న ఎన్నికల్లో బీఎస్పీ పార్టీ తరపున బీసీలకు స్థానం కల్పించి ఎమ్మెల్యే గెలుపు కోసం అందరూ కలిసిమెలిసి బీఎస్పీ పార్టీ అభివద్ధి కోసం కష్టపడి పనిచేసేలా ముందుకు సాగదామని కోరారు. కార్యక్రమంలో సీనియర్ బీఎస్పీ నాయకులు మీజూరు సుబ్రహ్మణ్యం, సుధాకర్ (అహింస), దేగా సుబ్రహ్మణ్యం, కర్లపూడి. పోలయ్య, వాటంబేటీ సుబ్బారావు, మురళీ, వెంకటసుబ్బయ్య తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నృత్య నీరాజనంలో చిన్నారుల ప్రతిభ

ప్రజాశక్తి-గూడూరు టౌన్: హైదరాబాద్ చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో జరిగిన నత్య నీరాజనం-2023 లో గూడూరు శ్రీ శివలలిత భరత నాట్య కళాక్షేత్రం విద్యార్థులు సంప్రదాయ నత్యంలో విశేష ప్రతిభ కనబరిచారు. శ్రీ వాగ్దేవి కూచిపూడి నత్యాలయం ఆధ్వర్యంలో నత్య రంగంలో విశేష ప్రతిభ ఉన్న కళాకారులకు శ్రీ వేంకటేశ్వర, నటరాజ, నాట్య దీపిక అవార్డుల ప్రదానోత్సవం తిరుపతిలో జరిగింది. నాట్య గురువు పిండి మల్లిక వెంకయ్య ఆధ్వర్యంలో చిన్నారులు నత్య ప్రదర్శనలు ఇచ్చారు. చిన్నారులు సుహర్శిని, ప్రజ్ఞ, షమిత, జాశ్రిత, నిక్షిత, శ్రీవిద్యా, భవిష్య, శ్రీధార, లోక్యా, మిథున్, ఐశ్వర్య, గగన, మన్విత, భవజ్ఞాలకు నత్య నీరాజనంలో ప్రతిభ కనబరిచారు. వీరికి గాయని శోభారాజ్, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, కూచిపూడి నాట్యచార్యులు వేదాంతం రాధే శ్యాం చేతుల మీదుగా శ్రీ వేంకటేశ్వర, నటరాజ, నాట్య దీపిక అవార్డుల ప్రదానోత్సవం జరిగింది.

శ్రీసిటీని సందర్శించిన నెల్లూరు అసిస్టెంట్ కలెక్టర్

ప్రజాశక్తి-వరదయ్యపాలెం: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ జి.విద్యాధరి సోమవారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆమెకు సాదర స్వాగతం పలికి, ఏకీకత వ్యాపార నగరం ప్రగతిని వివరించారు. శ్రీసిటీ ప్రత్యేకతల గురించి చెబుతూ పెద్ద ఎత్తున ఉద్యోగాల కల్పన, స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతం చేస్తూ మేక్-ఇన్-ఇండియా ప్రచారానికి ధీటుగా వేగంగా అభివద్ధి చెందుతున్న దేశంలోని భారీ పారిశ్రామిక పార్కుల్లో ఒకటిగా శ్రీసిటీ ఎలా ఎదిగిందో తెలిపారు. అసిస్టెంట్ కలెక్టర్ ఎంతో ఆసక్తిని కనబరిచి, వివిధ అంశాలపై అడిగి శ్రీసిటీ గురించి తెలుసుకున్నారు.

ఊరందూరులో సుధీర్‌రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్‌ఛార్జి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం ఊరందూరులోని ఆయన స్వగహంలో ఘనంగా నిర్వహించారు. మొదట ఆయన తల్లి బొజ్జల బృందమ్మ వద్ద ఆశీర్వచనం తీసుకున్నారు. ఆ తరువాత బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, ఆయన సతీమణి రిషిత మొదట జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని దర్శించుకున్నారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు వీరికి ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల శేష వస్త్రంతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. అనంతరం బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఊరందూరుకు వెళ్లారు. అక్కడ వందలాది మంది అభిమానులు, టీడీపీ నేతల మధ్య బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి భారీ కేక్ కట్ చేసి తన జన్మదిన వేడుకలు నిర్వహించుకున్నారు. ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఆయనను గజమాలలతో సన్మానం చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియచేశారు. ఆయన ఇలాంటి జన్మదినాలు మరెన్నో జరుపుకోవాలని వారు కోరుకున్నారు. ఏర్పేడులో టీడీపీ నాయకులు అన్నదానం చేపట్టారు. బొజ్జల వెంకట సుధీర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియచేయడానికి శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు, రేణిగుంట మండలాలతో పాటు సత్యవేడు, వెంకటగిరి, తిరుపతి నియోజకవర్గాల నుంచి అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఊరందూరులో పండుగ వాతావరణం నెలకొంది. డాక్టర్ నైనారు పొన్నారావు, టిడిపి మండల అధ్యక్షుడు డాక్టర్ నైనారు పున్నారావు, టిడిపి కార్యకర్తలు ధనంజయ నాయుడు, శివ శంకర్ రెడ్డి, నాగరాజు నాయుడు, గురువారెడ్డి, నాగేశ్వరరావు, చంద్ర, రాఘవేంద్రరావు, బాలాజీ, కునా యాదవ్, సుబ్రహ్మణ్యం, ప్రభాకర్, కృష్ణవేణి తదితర నాయకులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి-క్యాంపస్: చంద్రగిరి నియోజకవర్గంలోని గ్రామీణ యువతలో ఉన్నటువంటి క్రీడా నైపుణ్యాలను వెలికి తీయడమే లక్ష్యంగా ఐపీఎల్ క్రికెట్ టోర్నీని నిర్వహిస్తున్నట్లు చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పేర్కొన్నారు. చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా యువతకు క్రికెట్ పోటీలు నిర్వహించేందుకు చంద్రగిరి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే చంద్రగిరి ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ఉత్కంఠ భరితంగా సాగింది. బరిలోకి దిగిన గ్రామీణ ప్రాంత యువత హోరాహోరీగా తలపడ్డారు. తుమ్మలగుంట సమీపంలోని వైఎస్ఆర్ క్రీడామైదానంలో సోమవారం జరిగిన క్రికెట్ పోటీల్లో అత్యధిక శాతం మంది క్రీడాకారులు పరుగుల వర్షం కురిపించగా పలువురు వికెట్లు పతనంలో తమప్రతిభ చాటుకున్నారు. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సూచనల మేరకు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డిలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. మ్యాచ్ జరిగే ప్రతి గ్రౌండ్ కు మోహిత్ రెడ్డి వెళ్లి క్రీడాకారులను పరిచయం చేసుకుంటూ మెడల్స్, కిట్లను పంపిణీ చేస్తుండటంతో ఆయనతో సెల్ఫీలు తీసుకుంటూ యువత తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు. అలాగే హర్షిత్ రెడ్డి టీ షర్టులు, పార్టిసిపేట్ చేసిన ప్రతి ఒక్కరికీ మెడల్స్ పంపిణీ చేస్తూ మొత్తం మ్యాచ్ లను పర్యవేక్షణ చేస్తున్నారు.

భిక్షాటనతో గ్రీన్ అంబాసిడర్ల నిరసన

ప్రజాశక్తి-సత్యవేడు: సత్యవేడు మండల కేంద్రంలో గ్రీన్ అంబాసిడర్లు సోమవారం వినూత్నంగా నిరసన తెలిపారు. పెండింగ్‌లో ఉన్న 41 నెలల వేతనాన్ని ప్రభుత్వం వెంటనే అందించాలని కోరుతూ సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో మండలంలోని గ్రీన్ అంబాసిడర్లు (పారిశుద్ధ కార్మికులు) చేతుల్లో తట్టలు పెట్టుకుని బజార్లో దుకాణాల వద్ద భిక్షాటన చేస్తూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు కార్యదర్శి, గ్రీన్ అంబాసిడర్ల సంఘం నాయకుడు రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం 41 నెలల నుంచి వెట్టి చాకిరీ చేయించుకుంటూ వేతనాలు చెల్లించడం లేదని ఆరోపించారు. వేతనాలు చెల్లించకుంటే సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్లు కుమార్, మునస్వామి, శేఖర్, చంద్రబాబు, సుబ్రహ్మణ్యం, మంజుల, గోవిందమ్మ, ఆర్ముగం తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుకు గురైన కార్మికురాలిని ఆదుకోవాలి

ప్రజాశక్తి-క్యాంపస్: తిరుపతి వ్యవసాయ కళాశాలలో కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్న ప్రమీలను సోమవారం ఉదయం వ్యవసాయ పనులు చేస్తుండగా పాము కాటేయడంతో అపస్మారక స్థితికి వెళ్లడంతో అక్కడే పనిచేస్తున్న తోటి కార్మికులు అధికారుల సహకారంతో తిరుపతి రుయా హాస్పిటల్ కు తరలించారు. విషయం తెలిసిన తక్షణమే సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు గండికోట నాగవెంకటేష్ రుయా హాస్పిటల్ వెళ్లి డాక్టర్లను ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ప్రమాదం జరిగితే ఇన్సూరెన్స్ సౌకర్యం లేదని, సరైన వేతనాలు ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం, కాంట్రాక్టర్లు తక్షణం స్పందించి వారికి మెరుగైన చికిత్స అందించాలన్నారు. వ్యవసాయ కళాశాల కాంట్రాక్ట్ కార్మికులు యూనియన్ అధ్యక్షురాలు వరలక్ష్మి, సిఐటియు జిల్లా నాయకులు ఎం. గంగులప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి-కేవీబీపురం: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని.. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి నిరంతరం ప్రజల కోసమే ఆలోచిస్తున్నారని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. సోమవారం మండలంలోని అంజూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. లేదా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హిస్టరీ అకాడమీ డైరెక్టర్ గవర్ల కష్ణయ్య, ఎంపీపీ మునిలక్ష్మీ, నందకుమార్, వైస్ ఎంపీపీ డేరాల శ్రీనివాసులు, జడ్పీటీసీ మూర్తి, మునెమ్మ, సింగిల్ విండో ఛైర్మన్ వెంకటరత్నం, ఏపీ మోడల్ స్కూల్ ఛైర్మన్ హరిబాబు, ఎస్సీసెల్ అధ్యక్షుడు అరుణ్, నాగయ్య, జగదీష్, హరి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-దొరవారిసత్రం: మండల పరిధిలోని మావిళ్లపాడు గ్రామ పరిధిలోని ఆదర్శ పాఠశాలలో మొదటి సంవత్సరం ఇంటర్ ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపల్ సీహెచ్ సుమలత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2023-2024 సంవత్సరానికి గాను ప్రథమ సంవత్సరం ఇంటర్‌లో 22 నుంచి జూన్ 7వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని.. వివరాలకు ఫోన్‌నంబర్లు 7032 996508, 9502097754, 9160995627, 83285 46632 లను సంప్రదించాలని కోరారు.

తిరుమలనగర్‌లో శివశంకర్ రాజు జన్మదినం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని తిరుమలనగర్ పంచాయతీ వైసీపీ ఇన్‌చార్జి గుండ్రాజు శివశంకర్‌రాజు జన్మదిన వేడుకలను సోమవారం పార్టీ శ్రేణులు, స్థానిక యువత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కోసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గుండ్రాజు లక్ష్మీదేవి, మంగళం డివిజన్ వైసీపీ అధ్యక్షులు ప్రళయ కావేరి నారాయణరెడ్డి, అమరావతి టూర్స్ అండ్ ట్రావెల్స్ అధినేత గణేష్, వైసీపీ నాయకులు జయప్రకాష్(జేపీ), బైరెడ్డి రమేష్, రజాక్, సుబ్రహ్మణ్యం, దయాకర్, గిరి, నాని తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE :: PALAMANER
H.M.O.P. No. 15 of 2023

BETWEEN:-
G. Rajarajeswari ..... Petitioner
And:-
M. Susendra ......Respondent

NOTICE

To
M. Susendra, S/o M. Manisetty,
D.No.8-11/b,
Indiramma Colony,
Chandragiri, Thondavada,
Tirupati Balaji District.

Whereas the above petition filed by the petitioner for dissolution of marriage dt. 28-11-2019 of the petitioner and you by passing a decree of divorce and for granting divorce, by dissolving the marriage between petitioner and you. If you have any abjection, you can file the same in person or through your counsel on 15.06.2023 at 10.30 AM in the above case before this Hon'ble court, failing which the matter will be decided in your absence.

Sd/- S. BARKATH,
ADVOCATE FOR PETITIONER.

గూడూరు PRL జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 266 / 2021

Canara Bank, Gudur, (Erst while Syndicate Bank),
Rep. by its Manager .... వాది
Vs
1. Balli Sudhakar and another ....ప్రతివాదులు

To
D1. Balli Sudhakar, S/o Sundaram,
13/266, Hospital Road, Gudur Town,
Tiruapti Dist.
D2. K. Paul, S/o not Known
Ashok Nagar, Gudur Town, Tiruapti Dist.

పై నెంబరులోని వాది తన లోను బాకీ రాబట్టుకొనుటకుగాను దావా దాఖలు చేసినందున ప్రతివాదుల నోటీసులకు గాను తే.14-06-2023 దిన వాయిదా వేసియున్నారు. కావున పై నెంబరు దావా విషయమై ప్రతివాదులకు ఎలాంటి ఆక్షేపణలు వున్న యెడల పై కోర్టు ఎదుట పై తేదిన ఉదయం 10.30 గం॥లకు హాజరై తెలుపుకోవలసినది. లేనియెడల ఎక్సీ పార్టీగా తీర్మానించబడును.

ఇట్లు,
టి. రఘురామి రెడ్డి,
వాదితరపున న్యాయవాది, గూడూరు.

మహారాజశ్రీ గూడూరు 7వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
O.S. No. 21 / 2018

1.కొమ్మల సుబ్రహ్మణ్యం,
S/o కె. ఎర్రయ్య వగైరా ......వాదులు
Vs
1. కొమ్మల చెల్లయ్య (Died) S/o కె. ఎర్రయ్య
2. కొమ్మల సుబ్రహ్మణ్యం(Died) S/o కె.ఆదెయ్య వగైరా ..... ప్రతివాదులు

దావానోటీసు

టు
D3 కొమ్మల కళ్యాణి, W/o Late కె. చెల్లయ్య
D4 కొమ్మల వంశీ, S/o Late కె.చెల్లయ్య
D5 కొమ్మల శ్రీలక్ష్మి D/o Late కె. చెల్లయ్య
D6 కొమ్మల ధనుష్ S/o Late కె. చెల్లయ్య
(4 నుండి 6 ప్రతివాదులు మైనర్లు అయినందున, వారి తల్లి అయిన 3 ప్రతివాది గార్డియన్)
నివాసం:D.No. 4-2-73,
శ్రీరాములువీధి, బాపూజీకాలని,
సూళ్ళూరుపేట, తిరుపతి జిల్లా.

పై వాదులు పంపకం కొరకు పై దావా వేసియున్నందున మీకు నోటీసు నిమిత్తం వాయిదా తే.15-06-2023దీన వేసియున్నారు. కావున ఆ దినం ఉదయం 10.30గం॥లకు మీరు స్వయంగా గానీ, వకీలు గారి ద్వారా గాని, పై కోర్టులో హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపకోవలసినది. లేనిచో మిమ్మల్ని ఎక్స్‌పార్టీగా తీర్మాణించబడును.

ఇట్లు,
మలిరెడ్డి శ్రీనివాసులు,
తుమ్మా చిట్టిబాబు,
వాదుల తరపు అద్వకేట్లు.